క్లుప్తంగా

నేడు విద్యుత్ కోత

కొల్లిపర: మండల పరిధిలోని అత్తోట విద్యుత్ పీడర్ పరిధిలో బుధవారం విద్యుత్ మరమ్మతుల నిమిత్తం విద్యుత్ నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ మండల ఏఈ ప్రదీప్ కుమార్ తెలిపారు. మంగళవారం మండల విద్యుత్ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ మరమ్మతుల నిమిత్తం అత్తోట, సిరిపురం, దంతలూరు, అత్తోట యాదవపాలెం గ్రామాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు

విధుల బహిష్కరించిన న్యాయవాదులు

తెనాలిరూరల్: పట్టణంలో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. పొన్నూరులో న్యాయవాది పట్ల అక్కడి పోలీసు అధికారులు అనుచితంగా వ్యవహరించారని, దీనిని నిరసిస్తూ ఈ నెల 10వ తేదీ వరకు విధులను బహిష్కరిస్తున్నామని తెలిపారు.

దొడ్డపనేని ఇందిరకు ఘననివాళి



తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ రాజకీయనేత, ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ దొడ్డపనేని ఇందిర 88వ జయంతిని మంగళవారం పట్టణంలో ఘనంగా జరుపుకున్నారు. ఇందిర చిత్రపటానికి, పట్టణంలోని ఆమె విగ్రహాలకు పలువురు అభిమానులు పుష్పాంజలి ఘటించారు. ఇందిర కుమార్తె, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేటలోని దొడ్డపనేని ఇందిర మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రతిభా సమావేశం నిర్వహించారు. గతేడాది పదోతరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు పి.రూపశ్రీకి రూ.2,000, ఎస్.నందినికి రూ.1500, షేక్ ఫర్వీనకు రూ.1500, అఫీసాకు రూ.1000 నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ గుమ్మడి సాంబశివరావు, గుమ్మడి రమేష్, నేలటూరి బెన్ను, కొడాలి శ్రీనివాసరావు, వుయ్యూరు రాజశేఖరరెడ్డి, ఈదర పూర్ణ చంద్, ఆలపాటి వెంకట్రామయ్య, దేవినేని రమాదేవి, బి.గోవర్ధనకుమారి, వి.శ్రీలక్ష్మి, గవిని దినేష్ పాల్గొన్నారు. పాఠశాలలోని 700 మంది విద్యార్థినీ విద్యార్థులకు పండ్లు, పూలు పంపిణీ చేశారు.

దాడి కేసులో నిందితుల అరెస్ట్

తెనాలిరూరల్: మైనర్ బాలికపై దాడి చేసిన తల్లి, పెద్దమ్మ, పెదనాన్నలను పోలీసులు అరెస్టు చేశారు. పట్టణ మారిస్‌పేట ఆర్‌ఆర్ నగర్‌కు చెందిన బాలికపై ఆమె తల్లి దుర్గ, పెద్దమ్మ బషీరున్నీసా, పెదనాన్న సింహాచలం దాడి చేసిన ఘటన గత జులై నెలలో వెలుగు చూసింది. ఘటనపై త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి బాలికను గుంటూరులోని సంరక్షణ కేంద్రానికి పంపారు. నిందితులైన ముగ్గురిని మంగళవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

ఆభరణాల చోరీపై ఫిర్యాదు

తెనాలిరూరల్: ఇంట్లోని ఆభరణాలు చోరీకి గురవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని నందులపేట ఆయేషా మసీదు వెనుక నివసించే షేక్ నమాజ్ ఇంట్లో ఇటీవల శుభకార్యం జరగ్గా, ఖమ్మం నుంచి బంధువులు వచ్చారు. బంధువులు వెళ్లిన నాలుగు రోజుల అనంతరం చూసుకోగా ఇంట్లో హ్యాండ్ బ్యాగ్‌లో ఉంచిన సుమారు రూ.3.50 లక్షల విలువైన ఆభరణాలు కనిపించకుండా పోయాయి. దీంతో పోలీసులను ఆశ్రయించగా టూ టౌన్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు.

తాడేపల్లి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లి దేవుడు మాన్యం గ్రౌండ్‌లో జనసేన, టీడీపీ నాయకులు జొన్న రాజేష్, గాదె వినయ్ ఆధ్వర్యంలో తాడేపల్లి సూపర్‌లీగ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను మంగళవారం ప్రారంభించారు. జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, గంజి చిరంజీవి, టీడీపీ తాడేపల్లి మండల ప్రధాన కార్యదర్శి కొల్లిశేషు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏ విధంగా కలసి ముందుకు వెళ్తుందో చెప్పడానికి ఈ టోర్నమెంట్ ఒక నిదర్శనన్నారు. జనసేన మంగళగిరి మండల అధ్యక్షులు వాసా శ్రీనివాసరావు, తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు అంబటి తిరుపతిరావు, తాడేపల్లి కార్యదర్శి చాముండేశ్వరి దేవి, 19వ వార్డు అధ్యక్షుడు కాసమని దినేష్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆ.. భవనాలకు సరికొత్త రూపు

- మున్సిపల్ కమిషనర్‌కు నూతన బంగ్లా నిర్మాణం
- మహిళా మండలి భవనానికి కొత్త సొబగులు



శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా మున్సిపల్ కమిషనర్ బంగ్లా



మహిళా మండలి భవనం

తెనాలి: జిల్లాలో ఏకైక సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీగా ఎదిగిన తెనాలిలో శిథిలావస్థకు చేరిన మున్సిపల్ కమిషనర్ బంగ్లా స్థానంలో నూతన నివాస భవనం నిర్మాణం చేపట్టనున్నారు. అదేవిధంగా మున్సిపాలిటీకి సమకూరిన మహిళా మండలి భవనాన్ని నైపుణ్య శిక్షణ కేంద్రంగా తీర్చిదిద్దనున్నారు. కౌన్సిల్ ఆమోదంతో ఇందుకు సంబంధించిన సన్నాహాలను ఆరంభించాయి.

పట్టణ నడిబొడ్డులోని కొత్తపేటలో మున్సిపాలిటీకి సువిశాలమైన స్థలం ఉంది. ఇందులోని ఒకప్పటి రహదారి బంగళా ఎంతో ప్రాముఖ్యతను కలిగివుంది. ముఖ్యమంత్రి నుంచి మంత్రుల వరకు ఉన్నతాధికారులు సహా ఎవరు తెనాలి పర్యటనకు వచ్చినా ఇందులోనే బస చేసేవారు. ప్రస్తుతం ఆ స్థానంలో తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రాన్ని నిర్మించారు. ఆ పక్కనే మున్సిపాలిటీ అతిథి గృహాన్ని నిర్మించుకున్నారు. అతిథిగృహానికి దక్షిణం వైపున మున్సిపల్ కమిషనర్ నివాస బంగ్లా ఉంది. అతిథిగృహం, కమిషనర్ బంగళాకు పడమరవైపున మున్సిపల్ ఉద్యోగుల రిక్రియేషన్ క్లబ్, తంత్రీ ప్రసార కేంద్రం ఉండేవి. కొన్నేళ్ల క్రితం రిక్రియేషన క్లబ్, తంత్రీ ప్రసార కేంద్రాన్ని కూల్చేశారు. ఆ ప్రదేశంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం కోసమని గతంలో మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేశారు. అది కార్యాచరణకు నోచుకోలేదు. ఖాళీగా ఉండటంతో ఆ స్థలాన్ని వాహనాల పార్కింగ్‌కు వినియోగిస్తున్నారు. దీని నివారణకు ఈమధ్యనే చుట్టూ ఇనుప కంచెను వేశారు.

ఈ నేపథ్యంలో సెలక్షన్ గ్రేడ్ హోదా కలిగిన తెనాలి మున్సిపాలిటీకి కమిషనర్ బంగ్లా లేకపోవటం లోటుగా భావించారు. శిథిలావస్థకు చేరిన ఈ బంగ్లా నివాస యోగ్యంగా లేకపోవటంతో కమిషనరుగా వచ్చినవారు బయట అద్దె భవనాల్లో నివసిస్తున్నారు. గత పుష్కరకాలం పైగా ఈ బంగ్లా ఖాళీగా ఉంటోంది. శిథిల భవనం, చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి, చూడ్డానికి భూత్ బంగ్లాలా తయారైంది. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్నలు కమిషనర్ బంగ్లాను పునర్నిర్మించాలని తలపోశారు. శిథిలావస్థకు చేరిన బంగ్లాను పడగొట్టి, ఆ స్థానంలో నూతన బంగ్లా నిర్మాణానికి సన్నద్ధమయ్యారు. ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆమోదం తీసుకున్నారు. పాత బంగ్లా పడగొట్టటం, కొత్త బంగ్లాకు డిజైన్, నిర్మాణ పనులకు ప్రాథమికంగా రూ.40 లక్షలను కేటాయించారు. మూడునెలల వ్యవధిలో నిర్మాణ పనులు ఆరంభం కాగలవని మున్సిపల్ ఇన్‌ఛార్జి ఇంజినీరు ఆకుల శ్రీనివాసరావు వెల్లడించారు.

అలాగే కొత్తపేటలోని మహిళా మండలి భవనం కొత్త రూపు సంతరించుకోనుంది. చైతన్యవంతమైన తెనాలిలో మహిళామండలికి సుదీర్ఘ చరిత్ర ఉంది. 1964 జనవరి 23న మహిళా మండలి ఏర్పడింది. 1969లో శాశ్వత భవనాన్ని నిర్మించుకున్నారు. ఆ ఏడాది మార్చి 30న దుర్గాబాయి దేశ్‌ముఖ్ చేతులమీదుగా ప్రారంభోత్సవం చేయించారు. తెనాలికి చెందిన సినీనటి శారద ఎంపీగా ఉన్నపుడు విడుదల చేసిన ఎంపీ ల్యాడ్స్ నిధులతో 1998లో పైఅంతస్తును నిర్మించుకున్నారు. అందులోనే బాలల / మహిళల గ్రంథాలయం నడుస్తోంది. పట్టణంలో వివిధ సంస్థలు /సంఘాల సమావేశాలకు కూడా మహిళామండలి ఎంతోకాలంగా వేదికగా నిలిచింది. కాలక్రమంలో మహిళా మండలి కార్యకలాపాలు తగ్గిపోయాయి. వీజీకే భవన్, ఓపెన్ ఆడిటోరియం, పెన్షనర్స్ అసోసియేషన్, తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రం... సహా పలు వేదికలు అందుబాటులోకి వచ్చాక, మహిళా మండలిలో ప్రైవేటు సమావేశాలూ జరగటం లేదు. దీంతో మహిళా మండలి భవనాన్ని ప్రభుత్వానికి అప్పగించారు. ఆ భవనాన్ని మహిళలకు నైపుణ్య శిక్షణకు వినియోగించాలని తీర్మానించారు. సంబంధిత జిల్లా అధికారులు వచ్చి పరిశీలించారు. ఆ క్రమంలో భవనం మరమ్మతులకు మున్సిపాలిటీ శ్రీకారం చుట్టింది. భవనానికి ఫ్లోరింగ్, సీలింగ్‌ను నిర్మించి చిన్నచిన్న మరమ్మతులుంటే పూర్తిచేస్తారు. ఇందుకోసం మున్సిపాలిటీ రూ.12.40 లక్షలను కేటాయించింది. ఈనెల 26వ తేదీలోగా పనులు పూర్తిచేసి భవనాన్ని సిద్ధంచేయనున్నారు. ఈ విధంగా రెండు ముఖ్యమైన భవనాలు కొత్త రూపు సంతరించుకోవటం విశేషమే కదా!



మహిళా మండలి భవనం సీలింగ్

నిధుల కేటాయింపులు



మున్సిపల్ కమిషనర్ బంగ్లా నిర్మాణానికి, మహిళా మండలి భవన రెనోవేషన్ చేపట్టాం. ఈ మొత్తానికయే వ్యయాన్ని మున్సిపల్ సాధారణ నిధుల నుంచి భరించటానికి నిర్ణయించాం. ఇందుకు కౌన్సిల్ ఆమోదమూ తీసుకున్నాం. మహిళల్లో నైపుణ్య శిక్షణకు మహిళా మండలి భవనాన్ని వినియోగిస్తాం.

–తాడిబోయిన రాధిక
మునిసిపల్ చైర్‌పర్సన్

10న వైకుంఠపురంలో ఉత్తరద్వార దర్శనం

ప్రత్యేక క్యూలైన్లతో సహా ఏర్పాట్లకు చర్యలు

తెనాలి: శ్రీలక్ష్మీపద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం వైకుంఠపురంలో ఈనెల పదో తేదీన ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్వర ద్వార దర్శన ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ముక్కోటి ఏకాదశి రోజున స్వామి అమ్మవార్లు ఉత్తర ద్వారంలో గరుడ వాహనంపై వేంచేసివుండి భక్తులకు దర్శనమిస్తారు. ఆలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కుంభం సాయిబాబు, ఆలయ సహాయ కమిషనర్ / కార్యనిర్వహణ అధికారిణి వి. అనుపమలు సంబంధిత బ్రోచర్‌ను ఆవిష్కరించారు. వివరాలను తెలియజేశారు. పదోతేదీన తెల్లవారుజామున 4.30 గంటలకు స్వామివారి ఉత్తర ద్వార దర్శనం ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ ఉత్సవానికి 10 నుండి 15 వేల మంది భక్తులు ఆలయానికి వచ్చే అవకాశం ఉందన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పా రు. ఉత్తర ద్వారంలో, మూలవరును దర్శించుకునేందుకు వీలుగా ప్రస్తుతమున్న క్యూలైన్లతోపాటు అదనంగా క్యూలైన్లు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. తాగునీరు, చిన్నపిల్లలు, బాలింతల కు పాలు సరఫరా, ఉచిత ప్రసాదం పంపిణీ ఉంటాయన్నారు. ఉచిత దర్శనంతో పాటు రూ.100, రూ. 300 దర్శన ప్రవేశాలు ఉంటాయన్నారు. దర్శనానంతరం భక్తులకు దక్షిణావృత బంగారు శంకుతీర్థం ఇవ్వటం జరుగుతుందన్నారు. ఇదే సందర్భంగా ఏడు వేలమంది భక్తులకు అన్నప్రసాదాన్ని అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. వీరితో ధర్మకర్తలు, అర్చకులు అళహరి రవికుమార్, సత్యనారాయణ గౌతమ్ ఉన్నారు.

సాహసోపేత రాజకీయ నేత 'అన్నాబత్తుని'

రేపు మాజీ మంత్రి సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా...



తెనాలి: చైతన్యవంతమైన తెనాలిలో విద్య, అనుభవం లేకుండా రాజకీయాల్లో రాణించటం అసాధ్యం. ఇవేవీ లేకపోయినా, సంకల్పబలం, ప్రజాసేవపై నిబద్ధత ఉంటే ప్రజల మనసులు గెలవటమే కాదు, రాష్ట్రస్థాయిలో ఆమాత్యుడిగా ఎదగొచ్చని నిరూపించిన రైతు బిడ్డ మాజీ మంత్రి అన్నాబత్తుని సత్యనారాయణ. రైతుగా, పశుపోషకుడిగా ప్రస్థానాన్ని ప్రారంభించి, రైస్‌మిల్లరుగా వ్యాపారంలోకి వెళ్లి, స్థానిక కౌన్సిలర్‌గా రాజకీయ రంగ ప్రవేశం చేసి, ఎమ్మెల్యేగా, మంత్రిగా ఎదిగారు సత్యనారాయణ. పట్టణ అయితానగర్‌లోని రైతు కుటుంబంలో 1936లో జన్మించిన అన్నాబత్తుని సత్యనారాయణ, పెద్దగా చదువుకోలేదు. వ్యవసాయం, పశుపోషణతో పాటు ఆదాయం కోసం రైస్‌మిల్లు వ్యాపారాన్ని చేపట్టారు. తన నాయకత్వ లక్షణాలతో రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎదిగారు. అదే క్రమంలో మున్సిపల్ రాజకీయాలకేసి చూశారు. కౌన్సిలరుగా గెలిచి, పరోక్ష పద్ధతిలో మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికయ్యా రు. పట్టణాభివృద్ధికి అవరోధంగా ఉన్న ట్రాఫిక్ మెరుగుదలకు ఆయన తీసుకున్న చర్యలను నేటికీ చెప్పుకుంటారు. ఎన్ని ఒత్తిడులు వచ్చినా పట్టించుకోకుండా ఆక్రమణల తొలగింపుతో నిరసనలు ఎదురైనా మొండిగా ముందుకే సాగారు. తర్వాతి కాలంలో ఆ చర్యలను అందరూ హర్షించారు. పండ్ల మార్కెట్, పురవేదిక ఆయన హయాంలో ఏర్పాటు చేసినవే. 1983, 1985లో రెండు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. రెండో పర్యాయం ఎన్నికయ్యాక, రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలశాఖ మంత్రి పదవిని చేపట్టారు. అప్పట్లోనే తెనాలి సరిహద్దుల్లో సోమసుందరపాలెం పంచాయతీ పరిధిలో ఆటోనగర్ ఏర్పాటుకు 56 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ప్రస్తుతం ఆటోనగర్ వ్యాపార కూడలిగా తయారైంది. మరోవైపు తనకు లేని విద్యాగంధాన్ని భావితరాలకు అందించాలని, గ్రామీణ విద్యార్థులకు ఉపాధినిచ్చే కోర్సులను తేవాలన్న భావనతో ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీని ప్రారంభించారు సత్యనారాయణ.

ఆయన తనయుడు, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నిర్వహణలో శాఖోపశాఖలుగా విస్తరించింది. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలోని అత్యుత్తమ విద్యాసంస్థగా, క్యాంపస్ ఎంపికల్లో మేటిగా గుర్తింపును పొందటం విశేషం. విద్యార్హతలు లేకున్నా ఆత్మవిశ్వాసం, పట్టుదల మెండుగా ఉంటే, విజయాల సాధనకు ఏదీ అవరోధం కాదని ఆయన నిరూపించారు. రాజకీయవేత్తగా తనదైన ముద్ర వేశారు. అందుచేతనే పార్టీలకతీతంగా సత్యనారాయణ అభిమానులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన కార్యకర్తలు వందలాదిగా ఏటా ఆయన వర్ధంతి రోజైన జనవరి 9న తమ అభిమాన నేతను స్మరించుకుంటారు.. నివాళులర్పిస్తారు.

మంగళగిరి ఓటర్లు 2,93,340

మంగళగిరి: మంగళగిరి నియోజకవర్గ తుది ఓటర్ల జాబితాను అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేశారు. మంగళగిరి, తాడేపల్లి, దుగిరాల పరిధిలోని గతేడాది ఆగస్టు నుంచి అక్టోబరు 18వ తేదీ వరకు బీఎల్‌వోలు సర్వే నిర్వహించారు. అక్టోబరులో అభ్యంతరాలు స్వీకరించి, వాటిపై విచారణ అనంతరం తుది జాబితా విడుదల చేశారు. ఇందులో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. మంగళగిరి అర్బన్‌లో పురుషులు 32,076, మహిళలు 34,666, ఇతరులు ఐదుగురు మొత్తం 66,747 మంది ఉన్నారు. మంగళగిరి రూరల్‌లో పురుషులు 37,183, మహిళలు 40,215, ఇతరులు ముగ్గురు మొత్తం 77,401, తాడేపల్లి అర్బన్‌లో పురుషులు 25,744, మహిళలు 27,658 మొత్తం 53,402, తాడేపల్లి రూరల్‌లో పురుషులు 21,151, మహిళలు 22,812 మొత్తం 43,963, దుగ్గిరాల మండలంలో పురుషులు 24,956, మహిళలు 26,867, ఇతరులు నలుగురు మొత్తం 51,827 మంది వెరసి మొత్తం 2,93,340 మంది ఓటర్లు ఉన్నారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో ఉన్న మహంకాళి అమ్మవారి దేవస్థానం హుండీ కానుకల లెక్కింపు బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.సునీల్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు హుండీ లెక్కింపు ప్రారంభవుతుందన్నారు. ఆసక్తి గల భక్తులు లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనవచ్చన్నారు.

ఇంజినీరింగ్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ



ఫిరంగిపురం: ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజినీరింగ్ సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో క్యాలెండర్, డైరీలను కార్యాలయంలో ఎంపీడీవో వెంకటేశ్వరరావు మంగళవారం ఆవిష్కరించారు. డైరీ ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సాంకేతిక పరమైన సమగ్ర సమాచారం అందిస్తుందని చెప్పారు. పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనివాసరావు, సంఘం జిల్లా ప్రెసిడెంట్ షేక్.ఘన్‌సైదా, మండల ప్రెసిడెంట్ ఎం.పవన్, సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పనుల పర్యవేక్షణ

స్థానిక 15వ వార్డులో మురుగు కాల్వల పూడికతీత పనులను మంగళవారం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో కార్మికులు మురుగు కాల్వలను బాగు చేశారు. పనులను వైఎస్సార్ సీపీ 15వ వార్డు కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు పర్యవేక్షించారు.

–తెనాలి



వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి అనుమతి

చినకాకాని క్యాన్సర్ ఆసుపత్రి స్థలంలో ఏర్పాటు

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థకు శుభవార్త ఇది. వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. నగర పరిధిలోని జాతీయ రహదారి వెంట చినకాకాని యార్లగడ్డ వెంకన్న చౌదరి అంకాలజీ రీసెర్స్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఆసుపత్రి స్థలంలో వందపడకల ఆసుపత్రి నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే స్థలాన్ని పరిశీలించారు. ఇన్‌స్టిట్యూట్ స్థలంలోని 8.05 ఎకరాలను ఆసుపత్రికి కేటాయించలని ఏపీ విద్య వైద్య మౌలిక సదుపాయల సంస్థ(ఏపీ ఎంఎస్ఐడీసీ) ప్రభుత్వానికి లేఖ రాసినట్లు అధికారులు తెలిపారు. ఇక్కడ ఓపీ కొనసాగడం లేదు. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయానికి అనుబంధంగా ఉన్న ఈ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఆసుపత్రి నిర్మాణం స్థానికులకు ఎంతో ఉపయోగపడుతుంది. మంగళగిరి, తాడేపల్లి నగర పాలక సంస్థతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలను దృష్టిలో ఉంచుకుని గత ఏడాది నవంబర్ 8న ప్రభుత్వం నిర్మాణానికి ఉత్తర్వులు జారీ చేసింది. మంగళగిరి పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా మార్చేందుకు వైస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో నిర్ణయం తీసుకున్నారు. అయితే ప్రభుత్వాసుపత్రిలో అవసరమైన స్థలం లేదని అధికారులు తేల్చడంతో చినకాకాని ఆసుపత్రిలో నిర్మించాలని నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.



చినకాకానిలో క్యాన్సర్ ఆసుపత్రి

ఒరిగిందని.. అల్లుకుంది!

స్థానిక జయప్రకాష్‌నగర్‌లోని క్రీస్తుసంఘం చర్చి రోడ్డులో విద్యుత్ స్తంభం ఉన్నా, వెలుతురు కనిపించటం లేదు. విద్యుత్ స్తంభం (ఎస్292 ఏ1-ఏ2) పక్కకు ఒరిగింది. దీనికితోడు చెట్టు కొమ్మల్లో ఒదిగిపోవటంతో విద్యుత్ దీపం వెలుగుతున్నా రోడ్డుపై పడటం లేదు. సంబంధిత శాఖ చెట్టు కొమ్మలను తొలగించి, విద్యుత్ కాంతులు వెలుగులీనేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

–తెనాలి



మహానాడులో గంజాయి కలకలం

అరకేజీ గంజాయి స్వాధీనం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని మహానాడు ప్రాంతంలో మరోసారి గంజాయి అమ్మకాలు మంగళవారం జరిగాయి. పసిగట్టిన పోలీసులు అమ్మకాలు జరిగే ప్రాంతంలో నిఘా ఉంచారు. గంజాయి కొనుగోలు చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. సేకరించిన వివరాల ప్రకారం.. మహానాడు వారధి కింద నివాసముంటున్న మణికంఠ అనే వ్యక్తి ఏజెన్సీ నుంచి భారీ మొత్తంలో గంజాయి తీసుకువచ్చి కేజీ అరకేజీ చొప్పున విక్రయాలు నిర్వహిస్తున్నాడు. మహానాడులో నివాసముండే నందు ఎలియాస్ పెద్దబారు గంజాయి సేవిస్తున్నాడని ఎస్‌బీ పోలీసులు గుర్తించారు. అతడిపై నిఘా ఏర్పాటు చేయడంతో ఈ విషయం బయట పడింది. స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మణికంఠ గంజాయిని పెద్దబారుకు ఇస్తుండగా పట్టుకునేందుకు ప్రయత్నించారు. ఈ ప్రయత్నంలో గంజాయి కొనుగోలు చేస్తున్న నందు మాత్రమే పోలీసులకు దొరికాడు. మణికంఠ మాత్రం చాకచక్యంగా తప్పించుకుని కృష్ణానది ఒడ్డున ఇసుక తిన్నెల్లో పరారయ్యాడు. నందు దగ్గర కొనుగోలు చేసిన గంజాయి కేజీన్నర ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మణికంఠ దొరికితే భారీమొత్తంలో గంజాయి లభించవచ్చని పలువురు పోలీసులు భావిస్తున్నారు. ఈ మధ్యకాలంలో తాడేపల్లి పోలీసులు గంజాయిపై దృష్టి సారించకపోవడంతో కొంతమంది పలు కాలేజీల వద్ద, పాఠశాలల వద్ద విద్యార్థులకు గంజాయి అమ్ముతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ప్రతిరోజు తాడేపల్లి వినాయకుడి గుడివద్ద గేటు సెంటర్‌లో రైల్వేగేటు పక్కనే కొత్తగా వేస్తున్న రైల్వేట్రాక్ వెంబడి తాడేపల్లి కృష్ణాకెనాల్ జంక్షన్ వరకు పలువురు విద్యార్థులు, యువకులు గంజాయి తాగుతున్నారని బహిరంగంగా చర్చించుకుంటున్నారు. గతంలో పలుమార్లు నందు ఎలియాస్ పెద్దబారు, అతని తమ్ముడు గంజాయి కేసులో పోలీసులు అరెస్ట్‌చేశారు.

పెదపాలెంలో పొలం పిలుస్తోంది

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని శృంగారపురం, పెదపాలెం గ్రామాల్లో మంగళవారం రైతులకు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి పి.శిరీష మొక్కజొన్న పైరును పరిశీలించారు. మొక్కజొన్న పంటలో కాండం తొలుచు పురుగును గమనించామని, నివారణ చర్యలు వివరించారు.

ఈ పురుగు నివారణకు అజ్ఞాశస్త్రం లేదా బ్రహ్మాస్త్రం పిచికారీ చేసుకోవాలని వివరించారు. యూరియా, డీఏపీ బదులు ద్రవ జీవామృతాన్ని లేదా ఘన జీవామృతాన్ని మొక్కలకు అందించాలని చెప్పారు. గ్రామాల్లోని రైతులు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ




తాడేపల్లిరూరల్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను తహసీల్దార్ కార్యాలయంలో దుగ్గిరాల యూనిట్ అధ్యక్షుడు అందె బాలచంద్ర మౌళి, తహసీల్దార్ ఐ. సునీత మంగళవారం ఆవిష్కరించారు. చంద్రమౌళి మాట్లాడుతూ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్‌బాషా ఆదేశాల మేరకు నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించామన్నారు. ఎంపీడీఓ అడిగోపుల శ్రీనివాసరావు, సహాధ్యక్షుడు వంకదార సుబ్బారావు, ఉపాధ్యక్షులు గుంటూరు పూర్ణ ప్రసాద్, పులివర్తి చిట్టిబాబు, ఈఓపీఆర్డీ కావూరి జవహర్‌లాల్ నెహ్రూ, డిప్యూటీ తహసీల్దార్ బి.కనకదుర్గ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పొట్లపాడులో రెవెన్యూ సదస్సు

మేడికొండూరు: మండల పరిధిలోని పొట్లపాడు గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వమించారు. రీసర్వేలో తప్పులతడకపై అధికారులకు అర్జీలు సమర్పించారు. తహసిల్దారు ఎం.హరిబాబు మాట్లాడుతూ గ్రామ సభ ముఖ్య ఉద్దేశం రీసర్వేలో జరిగిన తప్పులను సరి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామికి విశేష పూజలు



ఫిరంగిపురం: అమీనాబాద్ గ్రామంలోని కొండపై ఉన్న హరిహర సుత అయ్యప్ప స్వామికి మంగళవారం బాబు స్వామి విశేష పూజలు చేశారు. మూలవిరాట్‌కు పంచామృత అభిషేకాలు నిర్వహించి, విశేష నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా బాబు స్వామి మాట్లాడుతూ ఈ నెల 14న సాయంత్రం 6:45 గంటలకు మకరజ్యోతి దర్శనం, విశేష పూజలు నిర్వహిస్తామన్నారు. కృష్ణస్వామి భక్త బృందం భజన, మూలాంకురేశ్వరి భజన సభ్యులతో కోలాట ప్రదర్శన, ఫిరంగిపురం విజయదుర్గా భజన సమాజం కోలాట ప్రదర్శన నిర్వహిస్తామని చెప్పారు.